క్లుప్తంగా

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారికి చండీహోమం చేశారు. సాయంత్రం స్వామివారికి పంచహారతులు, పల్లకీసేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ దాత సంగా నరసింహారావు, ఈఓ ఎన్.భవాని, భక్తులు పాల్గొన్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సదస్సు

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం క్వాంటమ్ కంప్యూటింగ్‌పై రెండు రోజుల సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సులో హైదరాబాద్‌కు చెందిన క్విన్ఫోసిస్ సీఈవో, చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ వల్లూరి మహేశ్వరరావు మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్‌తో సైనిక, బ్యాంకింగ్ నెట్‌వర్క్ భవిష్యత్తు సురక్షితంగా ఉంటాయని చెప్పారు. ధనేకుల కాలేజీలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హాకథాన్-2025 సెమీ ఫైనల్స్ ఈనెల 28న నిర్వహిస్తామని తెలిపారు. కాలేజీ కార్యదర్శి ధనేకుల భవానీప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, అకడమిక్ డైరెక్టర్ రవిప్రసాద్, డాక్టర్ ఆర్.సత్యప్రసాద్, డాక్టర్ గోగినేని రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నవరం కోర్టుకు వచ్చిన వంశీమోహన్




గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సోమవారం స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు హాజరయ్యారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన స్థల వివాదం కేసులో మంజూరైన బెయిల్ షరతుల మేరకు ఆయన కోర్టుకు వచ్చి సంతకం చేశారు. ఈ సందర్భంగా కోర్టు బయట నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వారందరిని ఆప్యాయంగా పలకరించిన వంశీమోహన్ వీరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు పార్టీ నేతలు ఉన్నారు.

నున్న శివాలయంలో గజ్జెల పూజ



నున్న(విజయవాడరూరల్): కూచిపూడి నృత్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న బాలికలు సోమవారం నున్న గ్రామంలోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో గజ్జెల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన బాలికలు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం విద్యార్థులు నాట్య గురువు దేవరకొండ చంద్రశేఖర్ దంపతులకు సన్మానం చేశారు. నున్నలో ఏర్పాటు చేసిన శ్రీలాస్య కూచిపూడి ఆర్ట్స్ అకాడమీలో 40 మంది బాలికలు శిక్షణ పూర్తి చేసుకున్నారని నాట్య గురువు చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం బాలికలకు అర్చకుడు డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ గజ్జెల పూజ చేశారు.

వైభవంగా శ్రావణమాస పూజలు



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రావణమాస పూజలు సోమవారం వైభవంగా జరిగాయి. అమ్మవారికి విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీలక్ష్మీతిరుపతమ్మ సన్నిధిలో భక్తులచే శ్రీలక్ష్మీ సహస్రనామ పూర్వక కుంకుమార్చనలు చేశారు. అనంతరం శ్రీలలిత సహస్రనామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తరం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

యూరియా స్టాక్ నిల్

- సన్న, చిన్నకారు రైతుల్లో ఆందోళన
- మండలానికి సరఫరా కాని యూరియా
- పట్టించుకోని పాలకులు, అధికారులు



యూరియా కట్టలు (ఫైల్)

పెనమలూరు: తమది రైతు ప్రభుత్వం... రైతుల కష్టాల్లో పాలు పంచుకుంటాం... రైతులకు అన్నదాత సుఖీభవ ఇచ్చాం... రైతులు చాలా ఆనందంగా ఉన్నారని టీడీపీ నేతలు ట్రాక్టర్లతో గ్రామాల్లో డప్పుకొట్టుకుంటూ ఊరేగుతున్నారు. అయితే వాస్తవంగా రైతన్నలు మాత్రం యూరియా అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. మండలంలో యూరియా స్టాక్ నిల్‌కు చేరుకుంది. ఎరువుల దుకాణాలు, సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు యూరియా స్టాక్ లేకపోవడంతో వెలవెలపోతున్నాయి.

వివరాల్లోకి వెళితే.. పెనమలూరు మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు దాదాపు 5,800 ఎకరాల్లో జరుగుతోంది. అలాగే వాణిజ్య పంటలు, కూరగాయాలు మరో 1,500 ఎకరాల్లో సాగులో ఉంది. అధికారుల లెక్కల ప్రకారం మండలంలో సాగు చేసే పంటలకు యూరియా 1,200 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది. గత జగనన్న పాలనలో పంటల సాగు సీజన్ రాగానే రైతుభరోసా కేంద్రాల్లో పుష్కలంగా యూరియా స్టాక్ రైతులకు అందుబాటులో ఉండేది. దీంతో ఏ ఇబ్బంది లేకుండా రైతన్నలు చాలా ఆనందంగా పంటలు సాగు చేసేవారు.

మారిన పరిస్థితులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి తారుమారు అయ్యింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు 40 రోజులు గడుస్తున్నా యూరియా అందుబాటులో లేకుండాపోయింది. మండలానికి 1,200 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటివరకు మార్క్‌ఫెడ్, ప్రైవేటు ఎరువుల దుకాణాల నుంచి కేవలం 450 మెట్రిక్ టన్నులు మాత్రమే రైతులకు సరఫరా చేశారు. వచ్చిన యూరియా కూడా బడా రైతులు ఆర్థికంగా పెట్టుబడులు పెట్టడంతో ఏక మొత్తంలో యూరియా కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకున్నారు. ప్రభుత్వం నుంచి యూరియా సరఫరా చాలినంత లేకపోవడంతో సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు ఎరువుల దుకాణాలు నేడు స్టాక్ లేక ఖాళీగా ఉన్నాయి. అసలు యూరియా స్టాక్ ఎప్పుడు వస్తుందో కనీస సమాచారం కూడా అధికారుల వద్ద లేదు.

దిక్కుతోచని స్థితిలో రైతులు

కాగా రుణాలు తీసుకొని, బయట అప్పులు చేసి సాగు చేసే సన్న, చిన్నకారు రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బడా రైతులు యూరియా స్టాక్ తన్నుకుపోతుంటే అధికారులు నియంత్రించకపోవడంతో చిన్న రైతులకు యూరియా కట్ట కూడా దొరకలేదు. ఖరీఫ్ వరితో పాటు వాణిజ్య పంటలు పసుపు, కంద, అరటి, కూరగాయాలు, ఆకుకూరల పంటలకు యూరియా కొరత తీవ్రంగా ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే 300 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ సరఫరా చేసి, ప్రతి చిన్న రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటే వారి కష్టాలు కొంత తీరతాయి. అయితే ఈ దిశగా అసలు ప్రభుత్వం కాని, అధికారులు కాని కసరత్తు చేయకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో యూరియా వేయకపోతే పంట నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. కొన్ని ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో యూరియా అడిగితే యూరియాతో పాటు, కాంప్లెక్స్ ఎరువులు, దుబ్బు గుళికలు లింకు పెట్టి అంటగడుతున్నారని, ఇదెక్కడి న్యాయమని రైతులు ప్రశ్నిస్తున్నారు. కూటమి పాలనలో నేడు రైతన్నలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పలువురు రైతన్నలు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



యూరియా సరఫరా చేసే విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలి. చిన్న, సన్నకారు రైతులను ఆదుకోవాలి. గత 15 రోజులుగా యూరియా కోసం ఎదురు చూస్తున్నా ఫలితం లేదు. పంటలు నష్టపోయే ప్రమాదం ఉంది.

– షేక్ మస్తాన్‌వలి, రైతు, వైకుంఠపురం, గోసాల

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



ప్రేమ జంట ఏడుకొండలు, హసీనా

హనుమాన్‌జంక్షన్ రూరల్: మతాంతర వివాహం చేసుకున్న ప్రేమజంట సోమవారం హనుమాన్‌జంక్షన్ పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళ్లితే.. బాపులపాడు మండలం మడిచర్లకు చెందిన చొటుపల్లి ఏడుకొండలు(23), షేక్ హసీనా (21) గత ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఒకే గ్రామం కావడంతో ఇద్దరి మధ్య ఏర్పడ్డ పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఏడుకొండలకు చదువు అబ్బక పోవడంతో రోజువారీ కూలీగా పని చేస్తుండగా, హసీనా డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. ఇరువురి కులాలు, మతాలు వేరు కావడంతో తల్లిదండ్రులు వీరి ప్రేమ వివాహానికి అడ్డు చెప్పారు. దీంతో మూడేళ్ల క్రితం ఒకసారి ఇంటి నుంచి పరారయ్యారు. అప్పటికి హసీనా మైనర్ కావడంతో పోలీసులు, పెద్దలు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. అయినప్పటికీ ఇరువురి మధ్య ప్రేమాయణం కొనసాగింది. పెద్దలు పెళ్లికి ఒప్పుకోరనే భయంతో సోమవారం ఏడుకొండలు, హసీనా ఇంటి నుంచి వెళ్లిపోయి గుణదలలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తమకు తల్లిదండ్రుల నుంచి ప్రాణభయం ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. దీంతో ఇద్దరు మేజర్లు కావడంతో పోలీసులు తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

కంకిపాడు: కోడిపందేల శిబిరంపై కంకిపాడు పోలీసులు సోమవారం దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఉప్పలూరు గ్రామ పరిధిలోని ధర్మా ఎస్టేట్స్‌లోని ప్లాట్స్‌లో కొంత మంది వ్యక్తులు కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతంపై దాడి చేశారు. దాడిలో తొమ్మిది మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 10,270 నగదు, రెండు కోడిపుంజులు, నాలుగు కోడి కత్తులు, ఏడు మోటరు బైక్‌లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి.సందీప్ తెలిపారు.

నేటి నుంచి ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపు

కంకిపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో మంగళవారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో ఆధార్ శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు ఆధార్ నమోదు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిర్వహణ అస్తవ్యస్తం



చెరువును తలపిస్తున్న ఉయ్యూరు సర్వీసు రోడ్డు

- జాతీయ రహదారిపై చిమ్మ చీకట్లు
- సర్వీసు రోడ్లన్నీ జలమయం
- కలెక్టరుకు ఫిర్యాదు

ఉయ్యూరు: జాతీయ రహదారి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సర్వీసు రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. రాత్రిళ్లు చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. రహదారి పొడవునా పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు నిండిపోయాయి. రహదారిపై రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వీసు రోడ్డులో నిలిచిన నీటిలో వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఈ సమస్యలపై ఎన్నిసార్లు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసినా జాతీయ రహదారి అధికార యంత్రాంగంలో చలనం లేదు.

వెలగని వీధి దీపాలు

విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారి ఉంది. ఈ రహదారిపై ఉయ్యూరు మండలంలోని గండిగుంట, ఉయ్యూరు, ఉయ్యూరు-గురజాడ మధ్యన ఫ్లెటైవర్లు ఉన్నాయి. ఏ గ్రామం వద్ద, ఏ ఫ్లెటైవర్‌పైనా లైట్లు వెలగడం లేదు. నిత్యం చీకట్లోనే వాహనదారులు ప్రమాదకరంగా ప్రయాణాలు చేస్తున్నారు. జాతీయరహదారికి అనుకుని ఉన్న గ్రామాల వద్ద ప్రజలు చీకట్లలో రోడ్లు దాటలేక ప్రమాదాల బారినపడుతున్నారు.

సర్వీసు రోడ్ల వెంబడి ముళ్లపొదలు

ఫ్లెటైవర్లకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన సర్వీసు రోడ్లు అన్నీ చెరువులను తలపిస్తున్నాయి. కొద్దిపాటి వర్షానికే సర్వీసు రోడ్లులో నీరు నిలిచిపోతుంది.



ఉయ్యూరులో జాతీయ రహదారిపై వెలగని వీధిలైట్లు

డ్రెయినేజీ వ్యవస్థ కూడా సరిగా లేదు. సర్వీసు రోడ్లలో వెళ్లే పరిస్థితి లేకపోవడంతో హైవేపై సుదూర ప్రాంతాలకు వెళ్లి తిరిగి తమ గమ్యస్థానాలు చేరుకోవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. కొన్ని చోట్ల హైవేపై రాంగ్ రూట్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇక సర్వీసు రోడ్ల వెంబడి పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు ఏపుగా పెరిగిపోయాయి. జాతీయ రహదారుల శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వాహనదారుల నుంచి దావులూరు టోల్‌గేట్ టోల్ రుసుము వసూలు చేస్తున్నా కనీస నిర్వహణ ఉండటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

వీధి దీపాలు వెలగడం లేదని, రహదారి నిర్వహణ అధ్వానంగా ఉందని సోమవారం జిల్లా కలెక్టరుకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ పలువురు స్థానికులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై జిల్లా కలెక్టరు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన టెన్త్ విద్యార్థులకు స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున ఉపకార వేతనాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 580 మార్కులతో మండలంలో మొదటి స్థానం సాధించిన డి.హేమంత్ సాయి, 572 మార్కులతో మండలంలో తృతీయ స్థానంలో నిల్చిన సీహెచ్ సునీత, 563 మార్కులతో నాల్గో స్థానం పొందిన ఎ.మహిమ కాంక్షలకు రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.15 వేలు స్కాలర్‌షిప్‌లను ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మల, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శుభగణపతి ఆలయ వార్షికోత్సవం

కంకిపాడు: ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో వేంచేసిన శుభగణపతి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పంచామృతాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు జరిపించి ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమాన్ని గాయత్రీ విహార్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.భరత్‌కుమార్ పర్యవేక్షించారు.

డ్రెయిన్ల పారుదలకు చర్యలు

రామవరప్పాడు: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మురుగు నీటి పారుదలకు ఆటంకంగా మారిన డ్రెయిన్లను సోమవారం ప్రసాదంపాడులో పూడిక తీయించారు. గ్రామంలోని బీఎంపీఎస్ రోడ్డు, ఎస్సీ కాలనీ, బల్లెంవారి వీధి, సెయింట్ ఆన్స్ పాఠశాల తదితర ప్రాంతాల్లో పూడిక తీశారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్లలో వ్యర్థాలు తొలగించారు. సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి మురుగు పారుదలకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలోని పలు డ్రెయిన్లలో వర్షాల కారణంగా వ్యర్థాలు తిష్ట వేసి మురుగు పారుదల అవ్వడం లేదన్నారు. ఫలితంగా అంతర్గత రహదారులు, జాతీయ రహదారిపై వర్షంనీరు నిలుస్తుండటంతో డ్రెయిన్ల పూడికతీత పనులు నిర్వహించామని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందితో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

'హలో మాల - చలో ఢిల్లీ' తరలివెళ్లిన నేతలు



కంకిపాడు: హలో మాల – చలో ఢిల్లీ కార్యక్రమానికి మాలమహానాడు నాయకులు భారీగా తరలివెళ్లారు. ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయడానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు తెచ్చిన ఆర్డినెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని ధర్నా చౌక్‌లో తలపెట్టిన ధర్నాకు జిల్లా నుంచి శ్రేణులు సోమవారం బయలుదేరివెళ్లారు. మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు మాట్లాడుతూ మాలల న్యాయమైన డిమాండ్ల సాధనకు చేపట్టే ఆందోళనకు ప్రతి ఒక్కరూ కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఆందోళనలను విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్టు

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ ఫిరోజ్ కథనం మేరకు.. పెనమలూరు చిన్న గుడి సమీపంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఆదివారం రాత్రి తనఖీ చేశారు. ఇంట్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ. 3,490 సొమ్ము స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు.

వినోదం కంటే విద్య ముఖ్యం

పెనమలూరు: వినోదం కంటే విద్య ముఖ్యమని ది హిందూ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ ఎ.శ్రీధర్ పేర్కొన్నారు. కానూరు వీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం బిజినెస్ మేనేజిమెంట్ విభాగం ఆధ్వర్యంలో ప్రసార మాధ్యమాల విశ్లేషకులతో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ఎల్లప్పుడు పుస్తక పఠనం చేయాలని, దీని వలన ఏ సమస్య ఎదురైనా ఆందోళన చెందకుండా అధిగమించవచ్చని వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, ఏ పని ఎప్పుడు, ఎందుకు చేయాలో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని సూచించారు. కాలాన్ని వృధా చేయకుండా లక్ష్యం కోసం శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో పత్రిక జనరల్ మేనేజర్ రావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి.ఆదిలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

దొడ్డిదారిలో కార్మికుల నియామకం సరికాదు

కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చిన కార్మిక సంఘ నేతలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో ఇటీవల దొడ్డిదారిన గుట్టుచప్పుడు కాకుండా కార్మికుల నియామకాలు చేయడం సరైన చర్య కాదని సీపీఎం మండల కార్యదర్శి, మున్సిపల్ కార్మిక సంఘ నాయకుడు షేక్ కాశిం విమర్శించారు. ఈ మేరకు సోమవారం తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్ నజీర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీలో ఇటీవల కాలంలో నిబంధనలకు విరుద్ధంగా 50 మంది కార్మికులను దొడ్డిదారిలో పనుల్లోకి తీసుకున్నారని తెలిపారు. కార్మికుడు మృతి చెందితే వారి కుటుంబంలో ఒకరికి పని ఇవ్వాలని, పదవి విరమణ చేసిన కార్మికుడి కుటుంబంలో కూడా పని ఇవ్వాలని గత రెండేళ్లుగా తమ సంఘం పోరాటం చేసినా అధికారులు స్పందించలేదన్నారు. కార్మికులకు పెండింగ్‌లో హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, సమ్మె కాలంలో జీతాలు చెల్లించాలని కోరుతున్నా కమిషనర్ స్పందించడం లేదని విమర్శించారు. కమిషనర్ ఏకపక్ష వైఖరి అవలంభించడం తగదన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు కమిషనర్ వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నేతలు సరళ, మధిర ఏడుకొండలు, వెంకటరెడ్డి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల సంయుక్త ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. సోమవారం మూడో రోజు పోటీలను వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్ కేవీఆర్ కిషోర్ ప్రారంభించారు.

అనంతరం గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాలకు చెందిన జట్ల మధ్య వాలీబాల్ పోటీలు జరిగాయి. మంగళవారంతో ఈ పోటీలు ముగుస్తాయని, వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతులు, షీల్డ్‌లను అందజేయనున్నట్లు కిషోర్ తెలిపారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు రామారావు, మీరా సాహెబ్, రాంబాబు, బాలా, చెన్నారావు, రవిప్రకాష్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తిరివీధి వెంకయ్య, టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఎస్ శ్రీనివాసరావు, బీ కోటేశ్వరరావు, ఎండీ అలీ, ముక్కామల సుబ్బారావు, చల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్త రేమల్లె పాఠశాలకు సామగ్రి వితరణ



గ్రామస్తులు అందజేసిన జాతీయ నాయకుల చిత్రపటాలతో సర్పంచ్ భారతి, ఉపాధ్యాయులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కొత్త రేమల్లెలోని మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలకు సోమవారం గ్రామస్తులు రూ.30 వేలు విలువ చేసే సామగ్రిని అందజేశారు. ఇటీవలే బదిలీపై పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడు వెలమర్తి రవిబాబు కనీస సదుపాయాలు లేకపోవడంతో చొరవ తీసుకుని గ్రామస్తులను సంప్రదించారు. దీంతో పలువురు ముందుకువచ్చి తమవంతు విరాళాన్ని అందజేశారు.

గ్రామ ప్రముఖుడు వడ్లమూడి వెంకట కృష్ణారావు గ్యాస్ స్టౌ, సర్పంచ్ చొటపల్లి భారతి రెండు టేబుల్స్, తొమ్మండ్రు మహాలక్ష్మయ్య రెండు సీలింగ్ ఫ్యాన్లు, వడ్లపట్ల సాంబశివరావు కుర్చీలు, తిరువీధి మరియదాస్ టేబుల్, టాయిలెట్ డోర్, పెనేమచ్చ దేవదాస్ స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను బహుకరించారు. అడిగిన వెంటనే పాఠశాలకు సామగ్రిని అందజేసిన గ్రామస్తులకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కట్టా దుర్గ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళ ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



పెనమలూరు: పోరంకి జిల్లా పరిషత్ విద్యార్థులు చిత్రకళ ప్రదర్శనలో ప్రతిభ చాటారు. కానూరులో కృష్ణా జిల్లా శాఖ సంస్కార భారతి ఆధ్వర్యాన జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో పోరంకి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు శ్రీకృష్ణ మహిమలు, కృష్ణుడి బాల్యంపై చిత్రకళ ప్రదర్శన నిర్వహించారు. సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ కృష్ణ చిత్రకళలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో చిత్రకళా ప్రముఖ్, విశ్రాంత చిత్రలేఖన ఉపాధ్యాయుడు ఆరేపల్లి అప్పారావు, వి.కృష్ణవేణి, శైలజవైష్ణవి, సీత, సభ్యులు పాల్గొన్నారు.